
సెప్టెంబర్ 17
75 వ తెలంగాణ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలతో


Organized By :
జనంగొంతు తెలుగు దిన పత్రిక

600 సంవత్సరాల
ఇస్లామిక్ రాజ్య
పాలన నుండి
75 వసంతాల
స్వేచ్ఛాస్వాతంత్ర్య
ఊపిరిలూదుతున్న
స్వతంత్ర తెలంగాణ
పరిశోధనాత్మక వ్యాసాలను
ఆహ్వానిస్తున్నాం
మీ ఆర్టికల్స్ ను పంపండి 9542226669
కాకతీయ సామ్రాజ్య సామంత రాజులు నందగిరి సంస్థానం న్యాలకొండ దేశాయి ల సౌజన్యంతో
750 - 132B AD



JANAMGONTHU TELUGU DAILY

# జనంగొంతు

Online:- https://janamgonthu.in
"https://epaper.janamgonthu.in

తెలుగు దినపత్రిక



కావలెను
జనం గొంతు
తెలుగు దిన పత్రికకు
భ్యూరో ఇన్-చార్జ్, స్టాఫ్ రిపోర్టర్
మండలాల వారిగా
విలేఖరులు కావలెను
సంప్రదించు: 9542226669



కరీంనగర్ సంపుటి : 10 సంచిక : 207 శనివారం 18-04-2026 4 పేజీలు వెల 2/-


## తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించండి

### రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



(హైదరాబాద్)

ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా దూసుకెళ్తున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా అమెరికా పారిశ్రామికవేత్తల్ని ప్రోత్సహించాలని ఆ దేశ ఉన్నతస్థాయి ప్రతినిధి బందాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. డ్రోన్లు, కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్, ఏరోస్పేస్ కాంపోనెంట్స్, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్, సైబర్ సెక్యూరిటీ, స్పేస్ టెక్నాలజీ, ఏఐ ఇన్ డిఫెన్స్, శాటిలైట్స్ సిస్టమ్స్ అండ్ అడ్వాన్స్ కమ్యూనికేషన్స్‌లో రాష్ట్రాన్ని గ్లోబల్ లీడర్‌గా తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు.

డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో 'యూఎస్ నేషనల్ కాలేజ్ వార్' బంద సభ్యులతో మంత్రి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో తెలంగాణలో ఉన్న అవకాశాలు, ఇక్కడి అనుకూలతలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పాలసీలు మంత్రి శ్రీధర్ బాబు ఈ సందర్భంగా వివరించారు. రాకెట్ల తయారీ నుంచి అత్యాధునిక డ్రోన్ల వరకు, యుద్ధ విమానాల విడిభాగాల నుంచి శాటిలైట్ల వరకు అన్నింటిలోనూ 'మేడిన్ తెలంగాణ' మార్క్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తోందన్నారు. ఈ రంగం(ఏరోస్పేస్; డిఫెన్స్, స్పేస్)లో తెలంగాణ ఏటా 30 శాతానికి పైగా వద్ధిని రేటును నమోదు చేస్తోందన్నారు. అలాగే 2024-26 మధ్య కాలంలో ఎగుమతుల్లో 103 శాతం కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేట్(సీఏజీఆర్) నమోదయ్యిందన్నారు. లాక్హీడ్ మార్టిన్, బోయింగ్, సాఫ్రాన్, ఎయిర్ బస్, డస్సాల్ట్ ఏవియేషన్ తదితర ప్రపంచ దిగ్గజ ఏరోస్పేస్ కంపెనీలతో డీఆర్డీవో, భెల్, మిధాని, బీడీఎల్,ఆర్ సీఐ, హాల్ తదితర కేంద్ర రంగ ప్రభుత్వ సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. ఇవీ కాకుండా ప్రిసిషన్ ఇంజినీరింగ్, డ్రోన్లు, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 1500 కంటే ఎక్కువ ఎంఎస్ఎంఈలు 'తెలంగాణ బ్రాండ్'ను విశ్వవ్యాప్తం చేస్తున్నాయన్నారు. పెట్టుబడులకు మాత్రమే కాదు, సాంకేతికత, పరిశోధన, తయారీ, నైపుణ్యాభివద్ధిలో అమెరికాకు ఒక నమ్మకమైన దీర్ఘకాల వ్యూహాత్మక భాగస్వామిగా నిలిచేందుకు 'తెలంగాణ' సిద్ధంగా ఉందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, అడ్వాన్స్ మ్యాన్యుఫ్యాక్చరింగ్, స్పేస్ టెక్నాలజీ తదితర రంగాల్లో అమెరికా సంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలతో కలిసి పని చేస్తామన్నారు. ఫైనాన్షియల్ టైమ్స్ ఎఫ్ డీఏ ర్యాంకింగ్స్ ప్రకారం, ప్రపంచంలోనే అత్యంత 'కాస్ట్ ఎఫెక్టివ్ ఏరోస్పేస్ సిటీ'గా హైదరాబాద్ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వరుసగా ఐదుసార్లు 'బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస్' అవార్డును గెలుచుకుని 'గ్లోబల్ ఏరోస్పేస్ మ్యాప్'లో తెలంగాణ ఒక శక్తిమంతమైన కేంద్రంగా మారిందన్నారు.

## నేడు మ్యూజియంల్లోకి ఉచిత ప్రవేశం..

(హైదరాబాద్)

ప్రపంచ వారసత్వ దినోత్సవం నేపథ్యంలో ఈనెల 18న రాష్ట్రంలోని అన్నీ మ్యూజియంల్లోకి ఉచిత ప్రవేశం కల్పించనున్నట్లు తెలంగాణ వారసత్వ శాఖ ప్రకటించింది. తమ ఆధీనంలో ఉన్న అన్నీ మ్యూజియంలు, స్మారక కట్టడాలలోకి శనివారం ఉచిత ప్రవేశాన్ని కల్పిస్తున్నట్టు తెలియజేసింది. హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్స్‌లో ఉన్న రాష్ట్ర మ్యూజియంలో ప్రపంచ వారసత్వ దినోత్సవ వేడుకలను కూడా నిర్వహిస్తున్నట్టు వివరించింది. తెలంగాణలో గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడంలో దానిని వేడుకగా జరుపుకోవడంలో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని ఆ శాఖ తెలియజేసింది. సందర్శకులు హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్స్‌లో ఉన్న రాష్ట్ర మ్యూజియం, కుతుబ్ షాహీ సమాధులు; భోంగీర్ కోట, ఎలాగండల్ కోట, కరీంనగర్, వరంగల్, పిల్లలమర్రి, పనగల్ ఆలంపూర్ మ్యూజియంలు మొదలైన ప్రసిద్ధ ప్రదేశాలను ఎలాంటి ప్రవేశ రుసుము లేకుండా సందర్శించవచ్చని వివరించింది. రాష్ట్ర వారసత్వ సంపద అయిన ఈ ప్రదేశాలను సందర్శించవలసిందిగా విద్యార్థులు, చరిత్ర ప్రియులతోపాటు సాధారణ ప్రజలను ఆహ్వానిస్తున్నట్టు వారసత్వ శాఖ విజ్ఞప్తి చేసింది. ఇతర వివరాలకు తెలంగాణ వారసత్వ శాఖను 040-23234942 నంబర్‌లో సంప్రదించాలని ఆ శాఖ కోరింది.

## ఏడు లక్షల ఉద్యోగాలకు ముప్పు

### గ్యాస్ కొరతతో రెస్టారెంట్ రంగం కుదేలు

### నెలకు రూ.79,000 కోట్ల నష్టం

### పర్యాటక రంగంపైనా తీవ్ర ప్రభావం : పీహెచ్‌డీసీసీఐ రిపోర్ట్

(న్యూఢిల్లీ)

పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ ఘర్షణలు భారత రెస్టారెంట్ పరిశ్రమను కుదేలు చేస్తోన్నాయి. ట్రంప్ యుద్ధోన్మాదంతో అంతర్జాతీయంగా ఇంధన సరఫరా గొలుసు దెబ్బతినడంతో దేశంలో వంట గ్యాస్ కొరత తీవ్రమయ్యింది.. దీని ఫలితంగా భారతీయ రెస్టారెంట్ రంగం నెలకు ఏకంగా రూ.79,000 కోట్ల భారీ ఆర్థిక నష్టాన్ని చవిచూస్తోందని పీహెచ్‌డీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(పీహెచ్‌డీసీసీఐ) తన తాజా నివేదికలో వెల్లడించింది. ఈ రంగంలో 7 లక్షల ఉద్యోగాలు ఊడిపోవచ్చని అంచనా వేసింది. 2026 ముగింపు నాటికి ఈ రంగం రూ.6.46 లక్షల కోట్ల నష్టాన్ని చవి చూడొచ్చని తెలిపింది. ప్రస్తుతం రోజుకు రూ.2,650 కోట్ల మేర ఆదాయాన్ని కోల్పోతోందని పేర్కొంది.ఎల్‌పీజీ సరఫరాలో అంతరాయంతో రెస్టారెంట్ పరిశ్రమలో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఆర్ఏఐ) అధ్యక్షుడు సాగర్ దర్యాని ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు 10 శాతం రెస్టారెంట్లు తాత్కాలికంగా మూతపడ్డాయని, మిగిలిన 60 నుంచి 70 శాతం సంస్థలు ఇండక్షన్ కుకింగ్, ప్రత్యామ్నాయ ఇంధనాలు లేదా పరిమిత మెనూలతో నెట్టుకొస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల వినియోగదారుల రాక 8 నుండి 10 శాతం తగ్గడమే కాకుండా.. సగటు కస్టమర్ చేసే ఖర్చు కూడా 6 నుంచి 8 శాతం పడిపోయిందని ఆయన గణాంకాలతో వివరించారు.ఈ సంక్షోభం కేవలం ఆర్థిక నష్టానికే పరిమితం కాకుండా.. దేశంలోని లక్షలాది మంది కార్మికుల పొట్ట కొట్టేలా కనిపిస్తోందని ఈ నివేదిక పేర్కొంది. ప్రస్తుతం ఈ రంగంపై ప్రత్యక్షంగా ఆధారపడి జీవిస్తున్న 85 లక్షల మందిలో దాదాపు 5 నుంచి 7 లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తోంది.

**పర్యాటకానికి తీవ్ర దెబ్బ..** పశ్చిమ ఆసియా సంక్షోభం వల్ల విమానయాన రంగం మరోసారి తీవ్రంగా దెబ్బతింది. విమాన ప్రయాణాలు రద్దు కావడం, గగనతల ఆంక్షలు, విమానాల దారి మళ్లింపు వంటి సమస్యలను విమానయాన సంస్థలు ఎదుర్కొంటున్నాయని పీహెచ్‌డీసీసీఐ పేర్కొంది. "ఈ అంతరాయాల వల్ల ప్రధాన మార్గాల్లో ప్రయాణ సమయం 2 నుంచి 4 గంటల వరకు పెరిగింది.




దీనివల్ల ఇంధన వినియోగం, నిర్వహణ ఖర్చులు భారీగా పెరిగాయి" అని నివేదిక పేర్కొంది. విమానయాన నిర్వహణ ఖర్చులలో ఇంధనం వాటా 35-40 శాతం వరకు ఉంటుందని పరిశ్రమ అంచనా. ప్రస్తుత పరిస్థితి విమానయాన సంస్థల లాభదాయకతను మరింత దెబ్బతీసింది. ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే మధ్యప్రాచ్యం గగనతల కారిడార్లలో అంతరాయం కలగడం వల్ల కనెక్టివిటీ సామర్థ్యం తగ్గడమే కాకుండా.. విమాన ప్రయాణ ధరలు కూడా పెరిగాయి. ఈ రంగం సుమారు రూ.17,000-18,000 కోట్ల మేర నష్టపోవచ్చని పీహెచ్‌డీసీసీఐ అంచనా వేసింది. ఎందుకంటే ఈ పరిశ్రమ ఆదాయంలో 15-20 శాతం పశ్చిమ ఆసియా గగనతలం మీదుగా నడిచే విమానాల నుంచే లభిస్తుందని తెలిపింది.

**అగాధంలోకి కోట్ల మంది..** దేశ జీడీపీలో 8 శాతం వాటా కలిగి 4 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్న పర్యాటక, ఆతిథ్య రంగాలు ఈ సంక్షోభంతో అగాధంలోకి వెళ్తున్నాయి. ముఖ్యం గా విదేశీ పర్యాటకుల రాక 15 నుండి 20 శాతం మేర పడిపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని ఇంధన సరఫరాను క్రమబద్ధీకరించకపోతే దేశ ఆహార భద్రతలో, ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషించే ఈ సేవా రంగం కుప్పకూలే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీతో సీఎం రేవంత్ భేటీ..



(హైదరాబాద్)

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇవాళ ఢిల్లీలో కేంద్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలోని రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ధాన్యం సేకరణ అంశంపై వారు కేంద్ర మంత్రితో చర్చించారు. ఈ సందర్భంగా 2025-26 యాసంగి సీజన్‌కు సంబంధించి రాష్ట్రం నుంచి 30 లక్షల మెట్రిక్ టన్నుల పారాబాయిల్డ్ ధాన్యాన్ని సేకరించాలని సీఎం రేవంత్ కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు.

ఇక ప్రస్తుత సీజన్‌లో తెలంగాణలో ధాన్యం దిగుబడి అంచనాలకు మించి ఉంటుందని వారు వివరించారు. ఈ సీజన్‌లో సుమారు 90 లక్షల మెట్రిక్ టన్నుల పంట వచ్చే అవకాశం ఉందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో ధాన్యం సేకరణ సజావుగా సాగాలంటే ఎఫ్‌సీఐ ద్వారా కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరించాలని, నిల్వ సామర్థ్యం పెంపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణలో ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు, రైతులకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా సీఎం వివరించారు. దీనిపై స్పందించిన కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ, రాష్ట్ర విజ్ఞప్తులను పరిశీలించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## భారత్, పాక్ పోటాపోటీగా ఆయుధ పరీక్షలు : నోటమ్‌లు జారీ



(ఢిల్లీ)

క్షిపణుల ప్రయోగాలు చేపట్టనున్న నేపథ్యంలో భారత్-పాకిస్థాన్‌లు ఒకేసారి నోటమ్‌లు జారీ చేశాయి. ఈ క్రమంలో అరేబియా సముద్రంలో పోటాపోటీగా ఇరుదేశాలు క్షిపణుల విన్యాసాలు జరపనున్నట్టు తెలుస్తోంది. ఏప్రిల్ 20, తెల్లవారు జామున 3:00 గంటల నుంచి ఏప్రిల్ 21 మధ్యాహ్నం 3:00 గంటల వరకు పౌర విమానాలు, నౌకలు దూరంగా ఉండాలని పాకిస్థాన్ నోటమ్ జారీ చేసింది. అలాగే భారత్ కూడా ఏప్రిల్ 22న ఉదయం 9:30 నుంచి ఏప్రిల్ 25న రాత్రి 9:30 గంటల వరకు సుదీర్ఘ కాలానికి ఈ హెచ్చరికలు జారీ చేసింది. సముద్రంపై సైనిక విన్యాసాల సమయంలో నిర్దేశించిన జోన్‌లకు పౌర విమానాలు, నౌకలు దూరంగా ఉండాలని 'నోటీసెస్ టు ఎయిర్‌మెన్', 'మారిటైమ్ అడ్వైజరీస్' లాంటి హెచ్చరికలు జారీ చేయడం దేశాల మధ్య సాధారణంగా జరుగుతూనే ఉంటుంది. అయితే ఇరుదేశాలు ఒకేసారి ఈ నోటమ్‌లు ప్రకటించడం విశేషం. పాక్ 200 కిలోమీటర్ల మేర ఈ జోన్‌ను ప్రకటించగా, దానికి రెట్టింపుగా భారత్ 400 కిలోమీటర్ల క్షిపణుల విన్యాసం కోసం జోన్‌ను ప్రకటించింది. అయితే సరిహద్దు దేశాలు తరచూ ఇలాంటి క్షిపణుల ప్రయోగాలు నిర్వహిస్తూనే ఉంటాయి. ఆపరేషన్ సిందూర్ జరిగిన ఏడాది తర్వాత ఈ ఆయుధ పరీక్షలపై ప్రకటనలు వెలువడడం గమనార్హం.

## రోడ్డెక్కనున్న 60 ఎలక్ట్రిక్ మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు..




(హైదరాబాద్)

హైదరాబాద్ నగరంలో త్వరలో 60 ఎలక్ట్రిక్ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు రోడ్డెక్కనున్నాయి. కూకట్‌పల్లిలో నూతనంగా నిర్మించిన ఛార్జింగ్‌స్టేషన్‌ను ప్రారంభించిన రోజే వాటిని రోడ్డెక్కించేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. కూకట్‌పల్లి డిపోలో ప్రస్తుతం ఉన్న 60 పాత బస్సుల్లో కాలం చెల్లినవే ఉండగా వాటిని స్క్రాప్‌నకు పంపాలని యాజమాన్యం నిర్ణయించినట్లు డిపో మేనేజర్ డి.హరి తెలిపారు. గడువు ఉన్నవాటిని జిల్లాలకు పంపనున్నారు. ఇవి కాకుండా మరో 21 బస్సులను రెట్రోఫిట్‌మెంట్ పద్ధతిలో ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చనున్నారు. 240 బస్సులను రెట్రోఫిట్‌మెంట్ చేయాలని లక్ష్యం నిర్దేశించుకున్న నేపథ్యంలో ఆర్టీసీ ఈ నిర్ణయం తీసుకుంది.

డీజిల్ బస్సుల్లోంచి ఇంజిన్లు తొలగించి వాటి స్థానంలో ఎలక్ట్రిక్ మోటార్ల (బ్యాటరీ బస్సుల్లో ఉపయోగించేవి)ను అమర్చడం ద్వారా ఆ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా వాడుకోనున్నారు. డీజిల్ బస్సులను రెట్రోఫిట్‌మెంట్‌తో ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చే పరిజ్ఞానం కొన్నేళ్ల క్రితమే అందుబాటులో ఉండగా ఆర్టీసీ కూడా దీన్ని అనుసరించడానికి ప్రయత్నిస్తోంది. కానీ అది భారీ ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో పెట్టుబడి పెట్టే సంస్థలతో ఇటీవలే ఒప్పందం కుదుర్చుకుంది. సొంత ఖర్చుతో డీజిల్ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చి ఆర్టీసికి అందించనున్నాయి. తర్వాత వడ్డీతో కలిసి సమ వాయిదాల్లో ఒప్పంద గడువు ముగిసే వరకు ఆర్టీసీ ఈ సంస్థలకు చెల్లించనుంది. అనంతరం ఈ బస్సులు ఆర్టీసీ సొంతమవుతాయి.

పొగలేని ప్రయాణం.. గ్రేటర్‌లో ప్రస్తుతం 3200 బస్సులు ఉండగా సుమారు 1000 బస్సులు డొక్కువే. సంస్థ డొక్కు బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను తెస్తోంది. ప్రస్తుతం నగరంలో 440 ఎలక్ట్రిక్ బస్సులు ఉన్నాయి. డీజిల్ బస్సుతో పోల్చితే విద్యుత్ బస్సు ఏటా 70శాతం (46 టన్నులు) కార్బన్, 23 కిలోల నైట్రోజన్ ఆక్సైడ్ ఉద్గారాలను తగ్గిస్తుంది.

## తిరుమల దర్శనాల పేరుతో మోసాలు..

### భక్తులకు టీటీడీ కీలక హెచ్చరిక

(తిరుమల)

తిరుమల శ్రీవారి దర్శనాలు, గదులు ఇప్పిస్తామంటూ సోషల్ మీడియా వేదికగా కొందరు వ్యక్తులు సాగిస్తున్న మోసాలపై టీటీడీ ఉక్కుపాదం మోపింది. భక్తులను మాయమాటలతో నమ్మించి డబ్బులు వసూలు చేస్తున్న ముఠాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు, అలాంటి వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చ రించింది. ఈక్రమంలోనే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు టీటీడీ ఒక ప్రకటనలో వెల్లడించింది. సోషల్ మీడియాలో "శ్రావణ్ కళ తిరుమల, తిరుపతి వెంకటేశ్వర స్వామి దేవస్థానం" అనే ఐడీతో భక్తులను మోసగిస్తున్న ఇద్దరు వ్యక్తులను టీటీడీ విజిలెన్స్ విభాగం, పోలీసుల సమన్వయంతో అదుపులోకి తీసుకుంది. నిందితులను చిత్తూరు జిల్లా పెనుమూరుకు చెందిన కామసాని పవన్ కుమార్ అలియాస్ నాగరాజు, బోడిరెడ్డి చెన్నకేశవులుగా గుర్తించారు. వీరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఇటీవల కాలంలో ఇలాంటి మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. శ్రీవారి దర్శన టికెట్లు, గదుల బుకింగ్ కోసం టీటీడీ అధికారిక వెబ్‌సైట్ లేదా యాప్‌ను



మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేసింది. మధ్యవర్తులను, దళారు లను నమ్మి మోసపోవద్దని సూచించింది. ఎవరైనా దర్శనాలు, గదులు ఇప్పిస్తామని సంప్రదిస్తే, వెంటనే టీటీడీ విజిలెన్స్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నంబర్ 9866898630కు సమాచారం ఇవ్వాలని కోరింది.

